క్లుప్తంగా

రైలు గేటు తాత్కాలికంగా మూసివేత

పెడన: పట్టణంలో గూడూరు వైపు వెళ్లే రహదారిలో ఉన్న రైలు గేటును మూడు రోజులు పాటు మూసి వేస్తామని రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మతులు, గేటు మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 26వ తేదీ రాత్రి ఏడు గంటల వరకు గేటును మూసి వేస్తామని చెప్పారు. ఈ విషయమై పెడన పోలీసులకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పెడన: బలిపర్రులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 95 మందికి 64 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రవేశ పరీక్షకు 65 మందికి గాను 62 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ తెలిపారు. రుద్రవరం గురుకుల పాఠశాల జూనియర్ అధ్యాపకుడు జాన్‌కెనడీ పర్యవేక్షణాధికారిగా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్. సునీత తనిఖీ అధికారిగా వ్యవహరించారు.

స్పాట్ సిబ్బందికి షీర్ కుర్మా పంపిణీ



పెడన: పదో తరగతి మూల్యాంకనం జరుగుతున్న లేడియాంప్తిల్ బాలికోన్నత పాఠశాలలో సిబ్బందికి ఆదివారం షీర్ కుర్మా (పాలతో చేసిన సేమియా)ను డీఈఓ తాహెరా సుల్తానా పంపిణీ చేశారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దీనిని అందజేశామని డీఈఓ తెలిపారు. మచిలీపట్నం డీవైఈఓ యూ. సుబ్బారావు, పరీక్షల విభాగం ఏసీ డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వి.కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఆదిశేషయ్య

కోడూరు: వి.కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన రేపల్లె ఆదిశేషయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా కోసూరు రమేష్ వ్యవహరించారు. ఆదిశేషయ్యతో పాటు పర్సన్లుగా రేపల్లె సతీష్, యలవర్తి నాగమల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీతో సీఈఓ బాదర్ల వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీని కోడూరు, లింగారెడ్డిపాలెం పీఏసీఎస్ చైర్మన్లు పరిశె మాధవరావు, చిట్టిప్రోలు బ్రహ్మారావు సత్కరించారు. సర్పంచి యలవర్తి నాంచారయ్య, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, మిల్క్ సొసైటీ చైర్మన్ రేపల్లె పిచ్చేశ్వరరావు, రేపల్లె రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నసమారాధన

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులోని మమత వృద్ధుల ఆశ్రమంలో అన్న సమారాధన చేశారు. కఠారి రాజమణి జ్ఞాపకార్థం భోజన ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, కఠారి శేషుబాబు, కఠారి కుషాల్, ఎం.శశాంక్, దీపికా దేవి, బొగ్గారపు తిరుపతయ్య, గొరిపర్తి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

గుడివాడటౌన్: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడం తమ లక్ష్యమని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో తనను కలిసిన స్థానికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుటుంబ సభ్యునికి ఆరోగ్యశ్రీ వర్తింప చేయాలని స్థానికులు ఎమ్మెల్యే నానిని అభ్యర్థించగా వైద్యం విషయంలో దిగులు చెందవద్దన్నారు. ఆరోగ్యశ్రీ అనేక వ్యాధుల్లో వర్తింపచేస్తున్నామని అలా కుదరని పక్షంలో సీఎం సహాయనిధి నుంచి వైద్య ఖర్చులు వచ్చేలా ఏర్పాటు చేస్తానని భరోసానిచ్చారు. ప్రజలు స్థానిక సమస్యలకు సచివాలయాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

క్రికెట్ బెట్టింగ్ నిందితుల అరెస్ట్

తోట్లవల్లూరు: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులకు అదుపులోకి తీసుకున్నట్లు తోట్లవల్లూరు ఎస్ఐ జి.రమేష్ తెలిపారు. మండలంలోని కుమ్మమూరు శివారు మద్దులవానిగూడెంలో మొబైల్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకోవటంతో పాటు వారి నుంచి రూ.50,600 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని రమేష్ హెచ్చరించారు.

కొత్త ఊళ్లు ఏర్పాటు

- ఉద్యమంలా జగనన్న గృహ నిర్మాణాలు
- నియోజకవర్గంలో 73 లేఅవుట్లు
- 19,710 గృహాల నిర్మాణం ప్రారంభం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలోని జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు ఉద్యమంలా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని నగర పాలక సంస్థ, మండలంలో దాదాపు 28 వేల మందికి నివేశన స్థలాలు పంపిణీ చేసింది. వీటిలో 20,520 మందికి గృహాలు నిర్మించుకునేందుకు మంజూరు లభించింది. ఇప్పటి వరకు 19,710 గృహ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. పక్కా గృహం నిర్మించుకుని సొంతింటి కల నెరవేర్చుకునేందుకు లబ్ధిదారులు సన్నద్ధమయ్యారు. గృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుండటంతో అన్ని జగనన్న లే అవుట్లలో నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. దీంతో నియోజకవర్గంలో కొత్త ఊళ్లు ఏర్పాటవుతున్నాయి.

కరగ్రహారం లేఅవుట్‌లో 16వేల మందికి స్థలాలు..

రాష్ట్రంలోనే అతి పెద్ద జగనన్న లేఅవుట్‌గా పేరొందిన కరగ్రహారం లేఅవుట్‌లో సుమారు 16 వేల మందికి నివేశన స్థలాలు ఇచ్చారు. ఈ లేఅవుట్లలో మెరక పనులు పూర్తి కావడంతో గత కొద్ది రోజులుగా గృహ నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునే లోపే విద్యుత్ శాఖాధికారులు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్లను సిద్ధంచేశారు. గృహ నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా గృహ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఈ గృహ నిర్మాణాలు పూర్తయితే ఈ ప్రాంతం పెద్ద గ్రామంగా రూపాంతరం చెందనుంది.





కరగ్రహారం లేఅవుట్‌లో ముమ్మరంగా సాగుతున్న గృహ నిర్మాణాలు (ఇన్‌సెట్) కరగ్రహారం లేఅవుట్‌లో నిర్మించిన ఇంటి వద్ద లబ్ధిదారు నాంచారమ్మ

తొలి అడుగు వేసిన నాంచారమ్మ..

16 వేల నివేశనా స్థలాల్లో మెరక చేసిన అనంతరం గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు వెనకడుగు వేశారు. అయితే 8వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారు వెరగని నాంచారమ్మ లేఅవుట్‌కు సమీపంలో ఉన్న హమాలీ కాలనీలో అద్దెకు ఉంటూ 2022 ఆగస్టు లో గృహనిర్మాణం చేపట్టింది. లేఅవుట్‌కు వెళ్లేందుకు సరైన దారి లేని సమయంలోనే ఆమె ఇబ్బందులకోర్చి మెటీరియల్‌ను చేర్చుకుని గృహనిర్మాణం చేపట్టింది. బోరులో సవ్వటి నీరు పడటంతో గృహ నిర్మాణం వేగంగా సాగింది. దీంతో ఆమె 2023 ఫిబ్రవరిలో గృహ ప్రవేశం చేసింది. దీంతో ఈ లేఅవుట్‌లో గృహం నిర్మించి ధైర్యంగా తొలి అడుగు వేసిన మహిళగా నాంచారమ్మ నిలిచింది. దీంతో మిగిలిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను చేపట్టారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.

కాలనీలో వసతులు..

నియోజకవర్గంలోని కరగ్రహారం పెద్ద లే అవుట్‌తో పాటు మిగిలిన గ్రామాల్లోని లే అవుట్లలో గృహ నిర్మాణాలకు అనువుగా విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు రహదారులను నిర్మిస్తున్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన నీటిని పైప్‌లైన్ల ద్వారా అందిస్తున్నారు.

అడవిలో కట్టావంటూ హేళన చేశారు



ఎడారిని తలపించేలా ఉన్న ఈ ప్రాంతంలో సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు ఎంతో కష్టపడ్డా. నాకు ఇచ్చిన 858 ప్లాట్‌లో గృహ నిర్మించి నివాసం ఉంటున్నా. నాకు స్థలం ఇచ్చి గృహం మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్, మాజీ మంత్రి పేర్ని నాని లకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– వెరగని నాంచారమ్మ, లబ్ధిదారు

లబ్ధిదారుల నుంచి స్పందన బాగుంది



కరగ్రహారంలోని పెద్ద లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యంతో పాటు రోడ్లు, నీటి వసతి కల్పించటంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకొస్తున్నారు. సుమారు 16 వేల మందికి ఇళ్ల స్థలాలు ఈ ప్రాంతంలో అందజేశారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతం పెద్ద గ్రామంగా మారనుంది.

– పరింకాయల విజయచంద్ర కుమార్, రెండో డివిజన్ కార్పొరేటర్

ఇరువర్గాల ఘర్షణ.. కేసుల నమోదు

కోడూరు: రెండు సామాజిక వర్గాల మధ్య ఏర్పడిన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ జరుగువానిపాలెం గ్రామానికి చెందిన మరో సామాజిక వర్గం యువకులు ఈ నెల 19వ తేదీన కులం పేరుతో దుర్భాషలాడారు. ఈ విషయమై ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామానికి చెందిన యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఇరువర్గాలవారికి నచ్చచెప్పి, రాజీ చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. శనివారం రాత్రి కేసుల విషయంలో ఇరువర్గాల వారు స్టేషన్‌కు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అవనిగడ్డ సీఐ శ్రీనివాస్ స్టేషన్ వద్దకు చేరుకుని వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామానికి చెందిన దోమా నరేష్ ఫిర్యాదు మేరకు జరుగువానిపాలెం గ్రామానికి చెందిన నలుగురు యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలాగే జరుగువానిపాలెం గ్రామానికి చెందిన జరుగు సురేష్ ఫిర్యాదు మేరకు ఇస్మాయిల్ బేగ్‌పేట గ్రామానికి చెందిన పది మంది యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తింపు గడువు పెంపుపై హర్షం

పెడన: రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచడంపై అప్స పెడన విద్యా సంస్థల కరస్పాండెంట్లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీలు కల్పలత, చంద్రశేఖరరెడ్డి, రామచంద్రారెడ్డిలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రైవేటు పాఠశాలల గుర్తింపును మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీలకు ఎ. గౌరీప్రసాద్, అజ్మతుల్లా ఖాన్, కుర్మా నాగమోహన్, కె. ప్రభాకర్, కె. దిలీప్ పాల్గొన్నారు.

అకాలవర్షంతో చల్లబడిన వాతావరణం

- సేద తీరిన ప్రజలు
- రైతులు, పశువులకు మేలు

బంటుమిల్లి: మండలంలో ఆదివారం ఉదయం గంట పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా మండుతున్న ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షానికి వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. ఉదయం 9 గంటలకు ఆకాశం మేఘావృతమై అనంతరం చిరుజల్లులతో మొదలై ఉరుములు, మెరుపులతో గంటపాటు భారీ వర్షం కురిసింది. బంటుమిల్లి కేవీఆర్ కాలనీతోపాటు పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు నిలిచింది. ఆదివారం కురిసిన అకాల వర్షం రైతులకు, పశువులకు మేలు చేస్తుందని పలు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత కొద్ది సంవత్సరాలుగా రైతులు సార్వా సాగులో వెద పద్ధతిని అవలంభిస్తున్నారు. ఈ పద్ధతిలో కలుపు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు రెండో పంటగా మినుము సాగు చేశారు. ఈ రెండు పంటల తాలూకు గింజలు సార్వా పంటలో మొలచి కేళీ గింజలు తయారవుతాయని భావించిన రైతులు కాలువ నీరు పెట్టి దుక్కులు దున్నుతున్నారు. పొలాల్లో పడ్డ వడ్లు, మినుము, గడ్డిజాతి గింజలు ప్రస్తుతం కాలువ నీటితో పనిలేకుండా ఈరోజు కురిసిన వర్షానికి మొలకెత్తడానికి అవకాశం ఏర్పడింది. దీని వల్ల రానున్న సార్వా పంటలో కలుపు ప్రభావం తక్కువగా ఉంటుంది. అలాగే రెండో పంట కోతల అనంతరం రైతులు పశువులను మేతకు వదిలి పెడతారు. వాటిలో ఆవులు వేలాదిగా పొలాల్లో మేత కోసం తిరుగుతుంటాయి. గత కొద్ది రోజులుగా కాస్తున్న ఎండలకు గడ్డి ఎండిపోయి భూములు ఏడారిని తలపిస్తున్నాయి. దీంతో పశువులు గ్రామాల్లో మేత కోసం తిరుగుతున్నాయి. ఈ అకాల వర్షం కొద్ది రోజుల్లో భూములు పచ్చ పడటానికి కారణమవుతుందని త్వరలోనే సంచార పశువులకు కొద్ది రోజులు మేత సమస్య పరిష్కారం అవుతుందని రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



వర్షానికి తడవకుండా పచ్చి ఇటుకలపై కప్పిన పరదాలు

ఇటుకబట్టీ వ్యాపారులకు నష్టం

మచిలీపట్నంటౌన్: ఆదివారం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై నగరంలో వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బుగానే ఉండి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో నగర ప్రజలు సేదతీరారు. అడపాదడపా గాలులతో కూడిన వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా అధిక ఎండలతో ఇబ్బందులు పడుతున్న నగరవాసులు ఆదివారం వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. నగర శివారుల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలకు ఈ వర్షం నష్టాన్ని మిగిల్చింది. చల్లపల్లి బైపాస్‌రోడ్డులో పెద్దఎత్తున ఉన్న ఇటుక బట్టీల పరిశ్రమ నిర్వాహకులు పచ్చి ఇటుకలను తయారుచేసి సిద్ధం చేసి ఉంచిన లాట్లను వర్షం నుంచి కాపాడుకునేందుకు పరదాలు కప్పారు. తయారు చేస్తున్న పచ్చి ఇటుకలను మాత్రం కాపాడుకోలేకపోయారు. దీంతో అవి తడిచిపోయాయి.

మోపిదేవిలో..

మోపిదేవి: ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఉరుములు, పిడుగులు తోడవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పెదకళ్లేపల్లిలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు భవనంపై తాకిన పిడుగుకు వాటర్ ట్యాంకు ధ్వంసమైంది. పెద్ద శబ్దం రావడంతో ఇంటిలో ఉన్న దుర్గారావు కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఏదో జరిగిందని గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



బంటుమిల్లి కేవీఆర్ కాలనీలో అంతర్గత రోడ్డులో నిలిచిన వర్షం నీరు

అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

షేక్ సలార్‌దాదా

కోనేరుసెంటర్: బందరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సెల్ఫీ ఛాలెంజ్ అంటూ గ్రూపుల ద్వారా చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

గత ప్రభుత్వంలో మరుగునపడిన పోర్టు పైలాన్ వద్ద కొల్లు రవీంద్ర ఫొటోలకు ఫోజులు ఇచ్చి బందరు పోర్టు అభివృద్ధి కుంటుపడిదంటూ సెల్ఫీ ఛాలెంజ్ పేరుతో పోస్టింగ్‌లు పెట్టడం సిగ్గుచేటన్నారు. పోర్టు పేరుతో వేలాది ఎకరాలకు నోటిఫికేషన్లు ఇచ్చి వందలాది కుటుంబాల ఉసురు పోసుకున్న ఘనత టీడీపీదేనని చెప్పారు. పైలాన్ కోసం ఎకరం భూమి కొనుగోలు చేసి అమ్మిన రైతుకు డబ్బులు ఇవ్వని ఘనత టీడీపీ ప్రభుత్వానిదని విమర్శించారు. పోర్టు కోసం రూ. 2,500 కోట్లు తెచ్చినట్లు చెప్పిన మీరు పోర్టు పనుల కోసం కనీసం సిమెంట్ బస్తా వాడిన పాపాన పోయారా అంటూ ప్రశ్నించారు. కనీసం ఏదైనా పోర్టు కార్యాలయం నిర్మించారా అని నిలదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న సలార్‌దాదా

నగరంలో జరుగుతున్న మెడికల్ కళాశాల, నాడు–నేడు పనులు, సచివాలయాల వద్దకు వెళ్లి కొల్లు రవీంద్ర సెల్ఫీలు దిగి ప్రజలకు చూపించాలని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే కొల్లు రవీంద్ర దిగజారుడు రాజకీయాలకు దిగుతున్నారని చెప్పారు. సమావేశంలో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, నియోజకవర్గ కన్వీనర్లు శీలం మారుతీరావు, చిటికెన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు, బందెల థామస్ నోబుల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది

ముదినేపల్లి రూరల్: ప్రజల ప్రాణాలు కాపాడే వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెదగొన్నూరు సచివాలయంలో విజయవాడకు చెందిన మెడ్‌స్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. వైద్యవృత్తి వ్యాపారధోరణిగా మారిన తరుణంలో ఉచితంగా వైద్య సేవలందించేందుకు మెడ్‌స్టార్ హాస్పిటల్స్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. వైద్యవృత్తిని సామాజిక బాధ్యతగా భావిస్తూ నాణ్యమైన సేవలందిస్తే ప్రజల గుండెల్లో వైద్యులు చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ఈ దిశగా వైద్యులు ఆలోచించి ప్రజలకు సేవలందించాలని కోరారు. శిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ విజయ్‌చైతన్య, న్యూరాలజిస్టు డాక్టర్ లంకగౌతమ్‌ముఖేష్, పల్మనాలజిస్టు డాక్టర్ జి.ఉదయకిరణ్ వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 250 మందికి ఎకో, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 15 మందికి ఎంజియోగ్రామ్ చేయాలని నిర్ణయించి ఉచితంగా సేవలందిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ తాడంకి శిరీష, సొసైటీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు శీలం రామకృష్ణ, సాక్షి సాయిబాబు, తాడంకి రాజేష్, పేరే రామకృష్ణ, బచ్చుల నాగవెంకట దుర్గాప్రసాద్, యండూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పెదగొన్నూరులో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఆక్యుప్రెషర్‌తో దీర్ఘకాలిక వ్యాధులు నయం

మచిలీపట్నంటౌన్: ఆక్యుప్రెషర్ వైద్య విధానంతో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చని వైద్యుడు ధనరాజ్‌చౌదరి అన్నారు. ఆక్యుప్రెషర్, వైబ్రేషన్, సుజోక్, అయస్కాంత చికిత్స ఉచిత వైద్యశిబిరం నగరంలోని బృందావనపుర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సమాఖ్య కృష్ణా జిల్లా శాఖ, ఆర్యవైశ్య మహిళా విభాగాల ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వేముల కృష్ణ మాట్లాడుతూ శిబిరం ఆరురోజుల పాటు జరుగుతుందన్నారు. 100 మంది రోగులకు ఆరు రోజుల పాటు చికిత్స అందజేస్తారని చెప్పారు. దీర్ఘకాలిక నొప్పులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు నేచురల్ పద్ధతిలో అరచేయి, అరికాళ్లలో ఆక్యుప్రెషర్ ద్వారా ఉపశమనం కల్పిస్తారన్నారు. రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా బయో ఎనర్జీని ప్రసరింపజేస్తామని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు అనువజ్ఞుడైన వైద్యుడు ధనరాజ్‌చౌదరి వైద్యసేవలు అందిస్తారన్నారు. ఆర్యవైశ్య యువజన సమాఖ్య ప్రతినిధులు సన్నిధి నాగసాయిశ్రీనివాస్, వేముల శ్రీనివాస్, వేముల శిరీష, జల్లూరు గోపి తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న వైద్యుడు ధనరాజ్‌చౌదరి

వైభవంగా గంగానమ్మ జాతర

పామర్రు(పమిడిముక్కల): మండల పరిధి మామిళ్లపల్లి గ్రామంలో గంగానమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శక్తి ఆధార సాంప్రదాయ రీతిలో గంగానమ్మ తల్లి సంబర మహోత్సవానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. గర్భాలయంలో అమ్మవారికి అభిషేకాలను నిర్వహించి గంగానమ్మ తల్లి ప్రతీక అయిన ఘటాలను అమ్మవారి విగ్రహాలను కృష్ణా నదిలోని పుష్కర ఘాట్‌కు ఊరేగింపుగా తీసుకువెళ్లి, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పొలిమేరలకు చేరుకుని గంగానమ్మ ప్రతీక ఘటాలను అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ వీధుల్లో అమ్మవారి ఘటాలను మేళతాళాలతో ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆదివారం అమ్మవారి ఆలయంలో సంబరాలను నిర్వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కుబడులను చెల్లించుకున్నారు. మేళతాళాలతో గ్రామోత్సవాన్ని ఘనంగా జరిపారు. గ్రామ సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జాతర మహోత్సవం జరిగింది.

ఆధ్యాత్మిక భావం పెంపొందాలి

- ఘనంగా శొంఠివారి రేణుక అంకమ్మతల్లి సంబరాలు
- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం హనుమంతపురంలో రెండు రోజులుగా మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు గృహం వద్ద నిర్వహిస్తున్న శొంఠి వారి రేణుక అంకమ్మ తల్లి సంబరాలు మూడవ రోజు ఆదివారంతో ముగిశాయి. అనేక ప్రాంతాల నుంచి శొంఠి వంశస్తులు వేలాది తరలివచ్చి అమ్మవారి ఆలయంలో మొక్కుబడులను చెల్లించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కైలే పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఎమ్మెల్యేను మేళతాళాలు, కనక తప్పెట్లతో ఘనంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి విశేష పూజలు చేశారు.

దాతకు సన్మానం..

ఎమ్మెల్యే కై లే మాట్లాడుతూ.. సంబరాల వలన ప్రజల్లో స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. గ్రామాలు సుభిక్షంగా ఉండేందుకు ఇటువంటి జాతర ఎంతగానో ఉపయుక్తమవుతాయని చెప్పారు. ఆలయానికి రూ.2 లక్షలను విరాళంగా ఇచ్చిన దాత శొంఠి నరసింహరావు దంపతులను ఎమ్మెల్యే సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, ఉయ్యూరు టౌన్ పార్టీ అధ్యక్షుడు జంపాన కొండలరావు, దాత శొంఠి నరసింహరావు, శింగరాయపాలెం ఆలయ కమిటీ చైర్మన్ శొంఠి నాగరాజులను సన్మానించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సర్పంచ్ కలపాల నాగరాజు, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

'బీసీలంటే బ్యాక్‌బోన్ క్లాసులు'

కైకలూరు: రాష్ట్రంలో బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాసులు కాదని, బ్యాక్‌బోన్ క్లాసులని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారని వడ్డీ సంక్షేమ సంఘ నాయకులు కొనియాడారు. ఇటీవల తెలుగుదేశం నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరి, సీఎం ఆశీస్సులతో ఎమ్మెల్సీగా పదవి పొందిన జయమంగళ వెంకటరమణను ఆటపాకలో ఆయన నివాసం వద్ద అమలాపురం వడ్డీ సంక్షేమ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీలో అధికశాతం మంది బీసీలకు సీఎం జగన్ అవకాశం కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా సీఎం జగన్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వడ్డీ సంక్షేమ సంఘం నాయకులు ముంగర ప్రసాద్, నబిగారి రవిశంకర్, నబిగారి కృష్ణమూర్తి, బొర్రా సత్యనారాయణ, నబిగారి సూరిబాబు, సైదులు వెంకటరమణ, నబిగారి ఫణి పాల్గొన్నారు.

ఆలయ గేటు నిర్మాణానికి విరాళం

దక్షిణచిరువోలులంక(అవనిగడ్డ): దక్షిణ చిరువోలులంక అద్దంకి నాంచారమ్మ ఆలయ గేటు నిర్మాణానికి శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు రూ.10 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకుడు సనకా రాజారామ్మోహనరావుకు ఆదివారం అందజేశారు. ఈడాబత్తిన వెంకటరమణ, నామన నాగేశ్వరరావు, సనకా గోపాలరావు, సనకా సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

కైకలూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ గౌతమ్‌కుమార్ అన్నారు. ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా వింజరం గ్రామంలో ఆదివారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రధానంగా డ్వాక్రా సంఘాల మహిళలకు పెరటితోటల పెంపకం పద్ధతులను వివరించారు. నేటి సమాజంలో పెరటి తోటల్లో లభించే కూరగాయలు, ఆకుకూరల్లో రసాయ రహిత పోషక విలువలు కలిగిన ఆహారం లభిస్తోందన్నారు. అదే విధంగా బెల్లం ద్రావణం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ అహోబలరావు, వీఓఏ కల్పన, వలంటీర్లు మహిళలు, రైతులు పాల్గొన్నారు.



వింజరంలో బెల్లం ద్రావణం తయారీని వివరిస్తున్న గౌతమ్‌కుమార్